
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
సోమవారం 22 సెప్టెంబరు 2025



కంది రైతుకు తీవ్ర నష్టం

- భారీ వర్షాలతో పంట పొలంలో చేరిన నీరు
- ఏపుగా ఎదగని మొక్కలు
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు
- పరిహారం చెల్లించాలని వేడుకోలు



7

నాందేవ్‌వాడ సాయిబాబా ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ప్రారంభమైన పూల పండగ



8

- ఘనంగా ఎంగిలి పువ్వు బతుకమ్మ వేడుకలు
- ఆటపాటలతో గౌరీ దేవతలకు పూజలు
- జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాల సందడి

తెలంగాణ సంస్కృతి చిత్రాన్ని ఆవిష్కరించే పూల పండుగకు వేళైంది. పొద్దు పొడవకముందే 'సద్దు' చేయక.. పూలకోసం అడవిబాట పట్టే బుడతల సందడి రానే వచ్చింది. 'ఒక్కేసి పువ్వేసి అంటూ.. అతివలంతా ఒక్కచోట చేరి 'గౌరమ్మ' కోసం పూల సింహాసనం సిద్ధం చేసే సమయం ఆసన్నమైంది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రారంభమైన ఉత్సవాలను 'ఎంగిలిపూల' బతుకమ్మతో ప్రారంభించి 'సద్దుల బతుకమ్మ'తో ముగించనున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, నిజామాబాద్

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు

- బాపూజీ చిత్రపటం, విగ్రహం వద్ద నివాళులు
- ఆయన సేవలను కొనియాడిన వక్తలు



కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు, స్వరాష్ట్రం కోసం పరితపించిన తెలంగాణవాది కొండా లక్ష్మణ్ బాపూజీ అని పలువురు వక్తలు కొనియాడారు.

(..లోపలి పేజీల్లో)



ప్రభుత్వం చిరు ఉద్యోగుల వేతన బకాయిలను విడుదల చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మూడు నెలలుగా జీతాలు లేక ఇక్కట్లు పడుతున్నారు. త్వరలో బతుకమ్మ, దసరా పండుగ ఉండడంతో వేతనాల కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఇరుగు పొరుగు కుటుంబాలు నూతన వస్త్రాలు, పండుగ సామగ్రి కొనుగోలులో బిజీగా ఉంటే.. తాము మాత్రం పైసల కోసం పడిగాపులు కాస్తున్నామని వాపోతున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల (స్కావెంజర్స్) మూడు నెలల వేతన బకాయిలు, అలాగే గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు రెండు నెలల జీతాలు అందాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే వేతనాలు మంజూరు చేయాలని లేదంటే తమకు పస్తులు తప్పవని చిరు ఉద్యోగులు వాపోతున్నారు.

పండుగకు పస్తులేనా?

మూడు నెలలుగా చిరుద్యోగులకు అందని వేతనాలు



- పండగ పూట తప్పని పడిగాపులు
- ఆశగా ఎదురుచూస్తున్న ఉద్యోగులు
- మూడు నెలలుగా స్కావెంజర్లకు, పంచాయతీ కార్మికులకు అందని జీతాలు
- రెండు నెలలుగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల ఆర్థిక ఇబ్బందులు

నిజామాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వేతనాలు సరైన సమయానికి రాక చిరు ఉద్యోగులు పండుగ పూట తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది రోజుల్లో దసరా, బతుకమ్మ పండగ ఉండగా ఇప్పటికీ వివిధ శాఖల్లో పని చేస్తున్న చిరు ఉద్యోగులకు మాత్రం వేతనాలు అందలేదు. పండగ పూట పిల్లలు ఇంటికి వచ్చే వేళ, పండగకు కొత్త బట్టలు కొనుక్కోవాల్సిన సమయంలో వేతనాలు సరైన సమయంలో రాక చిరు ఉద్యోగులు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. వీరిలో ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్లకు మూడు నెలలుగా వేతనాలు రావాల్సి ఉంది. వీరికి ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి వేతనాలం ఇస్తుండగా జూన్‌లో పాఠశాలలు ప్రారంభం కాగా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి మూడు నెలల వేతనం రావాల్సి ఉంది. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు సైతం రెండు నెలలుగా వేతనాలు రావాల్సి ఉంది. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు సైతం మూడు నెలల వేతనాలు అందాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు ప్రతినెల 1వ తేదీనే వేతనాలు పొందుతున్నారు. అన్ని శాఖల ప్రభుత్వ ఉన్నతాధికారులు, సిబ్బంది 1వ తేదీనే వేతనాలు పొందుతుండగా చిరు ఉద్యోగులు మాత్రం వేతనాల కోసం మూడు మూడు నెలలు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 1166 పాఠశాలలు

జిల్లా వ్యాప్తంగా 1166 ప్రభుత్వ పాఠశాలలో ఉండగా ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి స్కావెంజర్లు పని చేస్తున్నారు. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలలో ఒక స్కావెంజర్ పని చేస్తుండగా ఎక్కువమంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు ఇద్దరు స్కావెంజర్లు పనిచేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య పనులు చేసే స్కావెంజర్లకు నెలనెలా వేతనాలు అందడం లేదు ఈ ఏడాది జూన్ 12న పాఠశాల ప్రారంభం కాగా అంతకు ముందే జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినం నుంచే పాఠశాలలో బడి బాట కార్యక్రమాలు నిర్వహించి పాఠశాలలను శుభ్రం చేశారు. ప్రస్తుతం సెప్టెంబర్ నెల నడుస్తుండగా గత మూడు నెలలకు సంబంధించిన వేతనాలు

మిగతా 8వ పేజీలో...



కాపర్ కేటుగాళ్లు!



జిల్లాలో కాపర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్నారు. అందులోని కాపర్, ఆయిల్‌ను అపహరిస్తున్నారు. వాటిని విక్రయిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. కాపర్ కేటుగాళ్ల పనితనానికి అటు విద్యుత్ అధికారులు, ఇటు పోలీసులు, రైతులు బెంబేలెత్తిపోతున్నారు. చోరీలు ఎక్కువవుతుండడంతో రైతులు పరేషాన్ అవుతున్నారు.

- జిల్లాలో యథేచ్ఛగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ దొంగతనాలు
- కాపర్ దొంగతనాలతో రైతులకు లక్షల్లో నష్టాలు
- ఇప్పటికీ ఎత్తిపోతల ప్రాజెక్టులలో దొంగతనాలు
- పట్టించుకోని అధికారులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎత్తిపోతలే టార్గెట్‌గా కాపర్ దొంగలు రెచ్చిపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చోరీలకు అలవాటు పడ్డ కాపర్ దొంగలు కొంతకాలంగా తమ రూటును మార్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ తక్కువగా దొరుకుతుండటంతో బడా చోరీలకు స్కెచ్ వేశారు. లిఫ్ట్ ఇరిగేషన్‌లో భారీ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉండటంతో లిఫ్ట్ ఇరిగేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ఎత్తిపోతల పథకాల్లో ట్రాన్స్‌ఫార్మర్ చోరీలు జరిగాయి. తాజాగా ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌ను ఆనుకొని ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ అయిన డొంకేశ్వర్, వన్నెల్(కె) ఎత్తిపోతల పథకంలో భారీ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌ను దొంగతనం చేశారు. అంతకుముందు నందిపేట్, డొంకేశ్వర్ మండలాల్లోని తల్వేదా, కొండూర్, తదితర ఎత్తిపోతల పథకాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి దొంగతనాలకు పాల్పడ్డారు. ఒకే తరహాలో ఈ ఘటనలు జరుగుతున్నప్పటికీ చోరీలకు పాల్పడుతున్నది ఎవరనేది అంతుచిక్కడం లేదు. దుండగులు ఎత్తిపోతల పథకాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి లక్షల్లో విలువైన రాగి కాయిల్స్‌ను, ఆయిల్, ఇతర పరికరాలను దొంగిలిస్తున్నారు.

మిగతా 8వ పేజీలో...



డొంకేశ్వర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీతో రైతులకు భారం..

: నర్సారెడ్డి, డొంకేశ్వర్ లిఫ్ట్ చైర్మన్



ఎత్తిపోతల పథకాల ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవడంతో రైతులకు ఆర్థికభారం కానుంది. రైతులందరూ కలిసి డబ్బులు జమ చేసుకొని ఈ పథకాన్ని నడిపిస్తున్నాం. వీటిని బాగు చేసుకోవడానికి అదనపు ఖర్చు అవుతుంది. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ బాగు చేయడానికి లక్షల్లో ఖర్చు అవుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నాం.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి..

: రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్



రాత్రి సమయాల్లో ఎత్తిపోతల పథకాల వద్ద ఎవరూ లేకపోవడంతో దొంగతనాలు జరుగుతున్నాయి. రైతులకు ఇప్పటికే ఎత్తిపోతల వద్ద వాచ్‌మెన్‌లను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపాము. చిన్న చిన్న రిపేర్లకు రైతులే భరించాలి. పంప్‌హౌజ్, తదితర పెద్ద పెద్ద రిపేర్‌లు అయితేనే ప్రభుత్వం భరిస్తుంది.

నిజాంసాగర్ వరద గేట్ల కొనసాగింపు

- మంజీరాలోకి 55,772 క్యూసెక్కుల విడుదల



నిజాంసాగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టు ఎనిమిది వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 60 వేల 879 క్యూసెక్కుల వరద వస్తోంది. అధికారులు వీఆర్ నెం బర్-4లోని నాలుగు గేట్లను 20 వరద గేట్లలోని నాలుగు గేట్లను యథావిధిగా కొనసాగిస్తూ 54 వేల 772 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోనికి విడుదల చేస్తున్నారు. ఎనిమిది గేట్ల ద్వారా 55 వేల 772 క్యూసెక్కుల ప్రాజెక్టు నుంచి వదిలివేస్తున్నామని ప్రాజెక్టు అధికారులు అక్షయ్‌కుమార్ తెలిపారు.

పాఠశాలపై నుంచి దూకిన విద్యార్థి

- చీటీలు కొడుతుండగా పట్టుకున్న ఇన్విజిలేటర్
- మేనేజ్మెంట్ తప్పులేదంటున్న తండ్రి, ఎస్సై, డీఈవో
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

నిజామాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి సుమిత్ శుక్ర వారం ఆ భవనం రెండో అంతస్తు నుంచి దూకిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎఫ్ఎ-1 పరీక్షలలో భాగంగా శుక్రవారం విద్యార్థి సుమిత్ పరీక్ష రాస్తూ చీటీలు కొడుతుండగా టీచర్ చూసి వారి తండ్రికి సమాచారం ఇచ్చాడు.

మిగతా 8వ పేజీలో...



- జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన మండపాలు
- కొలువుదీరనున్న దుర్గామాత ప్రతిమలు
- రోజుకొక రూపంలో దర్శనమివ్వనున్న అమ్మవారు
- ఉత్సవాలలో కోలాటాలు, దాండియా ఆటలు
- తొమ్మిదిరోజుల పాటు ఉత్సవాల నిర్వహణ

నేటి నుంచి దుర్గా నవరాత్రులు

7



ఊరేగింపులో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే

ఘనంగా దుర్గామాత ఆగమన శోభాయాత్ర

- ప్రారంభించిన ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించే అమ్మవారి ఆగమన శోభాయాత్రను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త ప్రారంభించారు. ఆదివారం నగరంలోని ఇందిరప్రియనగర్ కాలనీ, బోయిగల్లిలో ఆగమన శోభాయాత్రలో ముఖ్య అతిథిగా హాజరై దుర్గామాత అమ్మవారిని దర్శించుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదిరోజుల పాటు వివిధ రూపాల్లో అమ్మవారిని దర్శించుకొని పూజించాలని అన్నారు. మానవ జీవితంలో ఒక్కొక్క శక్తి రూపం దిశానిర్దేశం చేస్తుందని అన్నారు. అమ్మ దయ ఉంటే మనం చేసే ప్రతి పనిలో వెనుక ఉండి నడిపిస్తుందని అన్నారు. చెడుపై మంచి విజయానికి సూచికగా దసరా, నవరాత్రులను జరుపుకుంటామని అన్నారు. తొమ్మిది రోజుల పాటు దీక్షగా అమ్మవారిని కొలువాలని ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలని అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటే అమ్మకు ఆనందం కలుగుతుందని అన్నారు. గతంలో అమ్మవారిని నిర్వాహకులు తక్కువ సంఖ్యలోనే ప్రతిష్ఠించే వారని రోజురోజుకు సంస్కృతి సంప్రదాయాలపై యువతకు ఆసక్తి పెరగడంతో పాటు అమ్మవారిపై భక్తి పెరగడంతో దుర్గామాతను ప్రతిష్ఠించి పూజించేవారు అధికమవడం సంతోషాన్ని ఇస్తుందన్నారు. ప్రజలందరూ ఐక్యతతో ప్రతి పండుగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు లత కృష్ణ, ఇల్లెందుల మమత ప్రభాకర్, ఆనంద్, పవన్ పాల్గొన్నారు.

డబ్బులతో బంగారం వ్యాపారి పరారీ

- సుమారుగా రూ.1.50 కోట్లతో ఉడాయింపు
- కామారెడ్డి జిల్లా పిట్లంలో ఘటన

6

వీడీసీ ఆగడాలను అరికట్టాలి

- రాష్ట్ర గీత పనివారాల సంఘం కార్యదర్శి

6

వరి పంటకు ఎండాకు తెగుళ్లు

- సస్యరక్షణే మేలు
- రైతులకు శాస్త్రవేత్తల సూచనలు

6

ప్రమాదకరంగా కల్వర్టు

- నిలిచిన రాకపోకలు
- మరమ్మతులు చేపట్టాలంటున్న గ్రామస్థులు

ప్రతీరోజు పండుగే



మొదటి రోజు నుంచి సద్దుల బతుకమ్మ వరకు ప్రతీరోజు పండుగలా జరుపుకునేవాళ్లం. మాది నల్గొండ జిల్లా పోలపల్లి. ఊరు వాళ్లంతా మా ఇంటి ముందు వచ్చి బతుకమ్మ ఆడేవాళ్లం. నాటి నుంచి ఏటా బతుకమ్మ వేడుకల్లో పాలుపంచుకోవడం ఆనందంగా ఉంటుంది. వైద్యురాలిగా ఎన్ని పనులున్నా మొదటిరోజు, సద్దుల బతుకమ్మ రోజు మరింత ఉత్సాహంగా పాల్గొంటాం. నగరంలో ప్రత్యేకంగా వేడుకలు నిర్వహిస్తే.. పాలుపంచుకోవడం ఆనందంగా ఉంటుంది.

- కవితారెడ్డి, స్త్రీవైద్య నిపుణురాలు, నిజామాబాద్

ప్రకృతి ప్రతిరూపం బతుకమ్మ...



ప్రకృతి ప్రతిరూపమైన పూలను పేర్చి, శక్తిని పూజించే ప్రక్రియనే బతుకమ్మ. చిన్నప్పుడు అమ్మతో కలిసి బతుకమ్మ పేర్చి స్నేహితులతో కలిసి ఆడేవాళ్లం. చెరువు వద్దకు వెళ్లి బతుకమ్మ ఆటలు ఆడి నిమజ్జనం చేసి సద్దులను తినడం సంతోషంగా అనిపించేది. ద్రవిడసంస్కృతికి మూలరూపమైన బతుకమ్మను రాష్ట్ర పండుగగా జరుపుకోవడం సంతోషకరం. బడులు, కాలనీల్లో బతుకమ్మ ఆడుతూ సంస్కృతిని ఇతరులకు తెలియజేయడం సాంఘీకరణలో భాగంగా అనిపిస్తుంది.

- శారదహన్మాండ్లు, కవి, రచయిత

బతుకమ్మ వచ్చిందంటే సంబురమే..



వినాయకచవితి ఉత్సవాలు అయిపోగానే బతుకమ్మ పండుగ వస్తుందని ఎదురు చూసేవాళ్లం. ప్రతీ సంవత్స రం ఊరువాడంతా కలిసి ఎంతో ఘనంగా బతుకమ్మ వేడుకలను జరుపుకునే వాళ్లం. ఇప్పుడున్నటువంటి పదవి బాధ్యతల వల్ల సద్దుల బతుకమ్మ పండుగ రోజు మాత్రం ఎన్ని పనులు ఉన్నా ఖచ్చితంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటాను. తొమ్మిది రోజుల పాటు మహిళలకు ఈ పూల పండుగ ఎంతో గొప్ప అనుభూతిని అందిస్తుంది.

- మాధురి, సంస్కారభారతి ఇందూర్ జిల్లా సమితి



క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ దుర్మరణం

మోపాల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):నర్సింగ్‌పల్లికి చెందిన ఆర్ఎంపీ గంగాధర్(41) రోడ్డుప్రమాదంలో శనివారం అర్ధరాత్రి మరణించినట్లు మోపాల్ ఎస్సై సుస్మిత తెలిపారు. గంగాధర్ నిజామాబాద్ నుంచి అర్ధరాత్రి బైక్‌పై నర్సింగ్‌పల్లికి వస్తుండగా సాంఘిక సంక్షేమ గురుకులం సమీపంలో చెట్టును ఢీకొన్నాడన్నారు. హాస్టల్‌లో పనిచేస్తున్న వాచ్‌మెన్ చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. గంగాధర్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మాసాని చెరువులో దూకి ఆత్మహత్య

మోపాల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): న్యాల్‌కల్ మాసాని చెరువులో దూకి అనిల్(41) మృతి చెందినట్లు ఎస్సై సుస్మిత తెలిపారు. నిజామాబాద్ పాటిగల్లికి చెందిన అనిల్ శనివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం అనిల్ మృతదేహం మాసాని చెరువులో కనిపించడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆర్థిక పరిస్థితులతో అనిల్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు అతడి బంధువులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హొన్నాజీపేట్‌లో ఉరేసుకొని..

ధర్పల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): హొన్నాజీపేట్‌లో ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కళ్యాణి ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన సురేష్(40) కొంతకాలంగా పెరాలసిస్‌తో బాధపడుతున్నాడు. ఆసుపత్రిలో చూయించుకున్న తగ్గలేదని, వైద్య ఖర్చులకు చేసిన అ ప్పులు చేసినా నయం కాలేదు. దీంతో ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పడుతూ.. జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో వ్యక్తిని చితకబాదిన ప్రయాణికులు

నవీపేట,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో న్యూసెన్స్ చేసిన వ్యక్తిని ప్రయాణికులు చితకబాదారు. స్థానికుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా తానూరు మండలం కేవీ గ్రామానికి చెందిన బడే రాము తన కుటుంబీకులతో కలిసి నిజామాబాద్ నుంచి స్వగ్రామానికి ఆదివారం బస్సులో వెళ్తున్నాడు. రాము కుటుంబ సభ్యులు బస్సు వెనుక భాగం వైపున కూర్చుని ఉండగా రాము ముందు వరుసలో ఉన్నాడు. మద్యం మత్తులో ఉన్న అతడు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. కోపోద్రిక్తులైన ప్రయాణికులు అతడిని చితకబాదారు. అనంతరం బస్సును నవీపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి నిందితుడిని పోలీసులకు అప్పగించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నామని ఎస్ఐ తిరుపతిని తెలిపారు.

డబ్బులతో బంగారం వ్యాపారి పరారీ

పిట్లం, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలో బంగారు వ్యాపారంలో వెలుగొందుతున్న ఓ వ్యక్తి 15రోజులుగా దుకాణం తెరవకపోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. సదరు వ్యాపారి గాంధీ విగ్రహ ఆవరణలో దుకాణం ఏర్పాటుచేసుకుని వ్యాపారం నిర్వహించేవారు. దీంతో అతడి వద్ద స్థానికులు చిట్టీలు వేయడంతో పాటు, వినియోగదారుల దగ్గర నుండి నగ తయారు కోసం డబ్బులు తీసుకున్నారని సమాచారం. ఈ వ్యాపారి సుమారుగా రూ.1.50 కోట్ల వరకు డబ్బులతో వెళ్లిపోయినట్లు తెలిసింది. అతడి వద్ద బంగారు నగల కోసం డబ్బులు చెల్లించిన వారు, చిట్టీల పాటల డబ్బులు ఇచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇక్కడే బంగారం వ్యాపారి నిర్వహించే మరో వ్యక్తి రూ.లక్షల్లో అప్పు చేసి నగదుతో ఉడాయించారు. ఓ యువవ్యాపారి దివాలా తీసి పలవురికి డబ్బులు చెల్లించకపోవడంతో ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. వరుస ఘటనలతో మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం పిట్లం ఎస్ఐ వెంకట్‌రావ్‌ను వివరణ కోరగా.. తమకు బాధితుల నుండి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

యువకుడి అదృశ్యం

కోటగిరి,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల కేంద్రానికి చెందిన గంగ మహేందర్(45)అనే యువకుడు అదృశ్యమైనట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. మహేందర్ ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి కనపడకుండా పోయాడన్నారు. దుర్గామాత కమిటీ లెక్కల విషయంలో కొందరు కమిటీ సభ్యులు మహేందర్‌పై అభాండం వేయడంతో మనస్తాపానికి గురై అదృశ్యమయ్యాడు. మహేందర్ తండ్రి నీలకంఠం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ల పట్టివేత

భీమ్‌గల్‌రూరల్,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవన్‌పల్లి నుంచి శనివారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. టిప్పర్ యజమాని షోకాత్, డ్రైవర్ సంతోష్‌పై కేసునమోదు చేసినట్లు చెప్పారు.

మోర్తాడ్,సెప్టెంబరు, 21(ఆంధ్రజ్యోతి): రామన్నపేట్ నుంచి జాగిర్యాల్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఏఎస్ఐ గోపాల్ తెలిపారు. శనివారం రాత్రి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను బీట్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌లు వసంత్, రాజేష్ పట్టుకొని స్టేషన్‌కు తీసుకువచ్చారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ వివరించారు.

వీడీసీ ఆగడాలను అరికట్టాలి



కోటగిరిలో మాట్లాడుతున్న నాయకుడు విఠల్ గౌడ్

కోటగిరి,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ ప్రాంతంలో రోజురోజుకు వీడీసీ ఆగడాలు ఎక్కువ అవుతున్నాయని, వాటిని తక్షణమే అరికట్టి పీడీ యాక్ట్ చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర గీత పనివారాల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం గీత పనివారాల సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటుచేసి మాట్లాడారు. తాళ్లరాంపూర్‌లో గీత వృత్తి కార్మికులపై దాడులు జరిగాయన్నారు. వీడీసీ ఆగడాలపై జిల్లా పోలీసు అధికారులు స్పందించాలన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అటు ప్రభుత్వం, ఇటు పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్, శ్రీధర్, రాజాగౌడ్, కృష్ణగౌడ్, ప్రకాష్, సాయికృష్ణ తదితరులున్నారు.

ముస్తాబవుతున్న దుర్గామాత మండపాలు



డొంకేశ్వర్,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గామాత మండపాలను నిర్వాహకులు ముస్తాబుచేశారు. మండల కేంద్రంలోని సత్యగంగవ్వ కళ్యాణమండపంలో ఏర్పాటు చేయనున్న మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్‌దీపాలతో మండపాలు కళకళలాడుతున్నాయి. అమ్మవారిని ప్రతిష్ఠించి 9 రోజులపాటు భక్తితో పూజలు చేయనున్నారు.

వరిలో సస్యరక్షణే మేలు

జిల్లాలో ఎండాకు తెగుళ్లు

రైతులకు శాస్త్రవేత్తల సూచనలు

రుద్రూరు,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లాలో ముందుగా వరినాట్లు వేస్తుంటారు. ప్రస్తుతం వరి పంట పూత దశ నుంచి గింజకట్టే దశలో ఉంది. 3రోజులుగా రుద్రూర్ ప్రాంతీయ చెరకు, వరి పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు పలు మండలాల్లోని రైతుల వరి పొలాలను సందర్శించారు. కొంతమంది రైతుల పొలాల్లో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఉధృతి అధికంగా ఉన్నట్లు వారు గమనించారు.

● ఇవీ లక్షణాలు..

ఎండాకు తెగులు ఎక్కువ శాతం దుబ్బు చేసే దశ నుంచి చిరు పొట్ట దశలో ఉన్న వరి పంటలను ఆశించే అవకాశం ఉంది. ఈ తెగులు ఆశించినప్పుడు ఆకులమీద అంచుల వెంబడి అలల మాదిరిగా నీటి రంగు మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చలు ఆకుల అంచుల వెంబడి కొన నుంచి కింది భాగం వరకు వ్యాప్తి చెందడంతో ఆకులు ఎండిపోతాయి. దుబ్బు చేసే దశ నుంచి చిరుపొట్ట దశలో ఈ ఆకులు ఎండిపోవడం వల్ల దిగుబడిపైన ఎక్కువగా ప్రభావం చూపుతుంది. అలాగే ఈ తెగులు ఆశించిన మొక్కలను గమనించి



ఎండాకు తెగులు సోకిన వరిపంట

నట్లయితే వాటి ఆకుల వెంబడి బ్యాక్టీరియాకు సంబంధించిన జిగురు ఉండలను కనిపిస్తాయి. ఇది ఒక మొక్క నుంచి మరొక మొక్కకు, ఇంకొక పొలంలోకి నీటి ద్వారా వ్యాప్తి చెందుతుంది. పంట నీటిముంపునకు గురైనప్పుడు ఎండాకు తెగులు ఇంకా ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. ఆగస్టు, సెప్టెంబర్‌లో అధిక వర్షాలు కురవడంతో ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది.

● సస్యరక్షణ ఇలా..

తొలిదశలో ఎండాకు తెగులును గుర్తిస్తే రాగిదాతు శిలింద్రనాశిని అయిన హైడ్రోక్సైడ్ మందును ఒక లీటర్ నీటికి 2గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా.లతో పాటు స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ లేదా ప్లాంటో మైసిన్ 0.4గ్రా లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. వరిపంట పూత దశలో తెగులు లక్షణాలు గమనిస్తే ఈ రాగిదాతు శిలీంధ్ర నాశినిని పిచికారీ చేయవద్దు. ముఖ్యంగా చిరుపొట్ట దశలో ఈ తెగులు తట్టుకునే శక్తిని పెంపొందించడం కోసం మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎకరానికి 15 - 20కేజీలు వేసుకుంటే బ్యాక్టీరియాను తట్టుకునే శక్తిని మొక్క గ్రహిస్తుంది.

● కాండం తొలుచు పురుగు ఉంటే ఇలా చేయాలి..

కొంతమంది పొలాల్లో కాండం తొలుచు పురుగు ఉధృతిని శాస్త్రవేత్తలు గమనించారు. అంకురం నుంచి చిరుపొట్ట దశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయి. ఈ పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50ఎస్‌పీ 2గ్రా.లు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 18.5 ఎస్‌సీ 0.3 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రైతులు సరైన సమయంలో చీడపీడలను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చు.

కారేగాం తండా వాసికి డాక్టరేట్



పట్టా అందుకుంటున్న లాల్‌సింగ్

మోస్రా,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): చందూర్ మండలం కారేగాంతండాకు చెందిన రమావత్ లాల్‌సింగ్ ఓయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. లాల్‌సింగ్ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో 2 డిగ్రీలు, తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఆచార్య విశ్వవిద్యాలయంలో మాస్టర్ లైబ్రేరీ సైన్స్ పూర్తిచేశారు. 2018లో ఓయూలో పీహెచ్‌డీ సీటు సాధించి, భారతదేశం స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్కృతి, సంప్రదాయాల మధ్య జరుగుతున్న ఘర్షణపై పరిశోధన చేశారు. హిందీ విభాగంలో సమకాలిన్ హిందీ ఉపన్యాస్ మే ఎక్ సాంప్రదాయక్ సంఘర్ష్(1950-2000) అనే అంశంపై ఆయన సిద్దాంత గ్రంథాన్ని రూపొందించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన ఓపెన్ వైవాలో రిటైర్డ్ ప్రొఫెసర్ అవినాష్ జైస్వాల్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, పరిశోధకులు, గ్రామస్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

ఆర్మూర్,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): మునిపల్లిలోని ఎంజేపీ గురుకుల బాలికల జూనియర్, మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మహిళా భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల రక్షణ చట్టాలు, షీటీం, 181, హెల్ప్‌లైన్, డొమెస్టిక్ వైలెన్స్ సెల్ గురించి సఖీ కోఆర్డినేటర్ భానుప్రియ వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు తమను ఎలా రక్షించుకోవాలో సఖీ లీగల్ అడ్వైజర్ లావణ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనూష పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులవి అసత్య ప్రచారాలు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వర్ని, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వర్ని మండల బీఆర్ఎస్ నాయకులు తమ పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం వర్నిలో సమావేశంలో మాట్లాడారు. పోచారం భాస్కర్‌రెడ్డి వల్ల డీసీసీబీ డైరెక్టర్లు అసంతృప్తికి లోనయ్యారని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. పోచారం శ్రీనివాసరెడ్డి కుటుంబం మీద నిందలు వేయడం బీఆర్ఎస్ నాయకులకు అలవాటుగా మారిందన్నారు. గడ్డు పరిస్థితిలో ఉన్న సహకార బ్యాంకును భాస్కర్‌రెడ్డి ఛైర్మన్‌గా గట్టెంకించారని కితాబిచ్చారు. 7సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పోచారం శ్రీనివాసరెడ్డి నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలు పొంది సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రంలోనే నంబర్1 స్థానం పొందారన్నారు. యలమంచిలి శ్రీనివాస్‌రావు తమపై ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ సురేష్‌బాబా, సాయిబాబా, రంజ్యానాయక్, కరీం, కిషన్, కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాలరాజు, వీరాజు, దశరథ్ పాల్గొన్నారు.

రైతు ఆదాయం పెంచడమే లక్ష్యం



వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వేల్పూర్ , సెప్టెంబరు, 21(ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయం పెంచడమే ప్రధాని మోదీ ఉద్దేశమని బాల్కొండ నియోజవర్గ బీజేపీ ఇంచార్జి మల్కన్నగారి మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌లు అన్నారు. ఆదివారం వేల్పూర్‌లో బీజేపీ నాయకులు సమావేశంలో మాట్లాడారు. కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ సవరించిన జీఎస్టీ 2.0 సంస్కరణలు ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట నిస్తాయన్నారు. రైతులకు పెట్టుబడి భారం తగ్గడంతో పాటు యంత్ర పరికరాలపై జీరో శాతం జీఎస్టీ ఉందన్నారు. ఈ సంస్కరణలతో పేద, మధ్య తరగతి వారు వారి కొనుగోలు సామర్థ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నేముల నర్సారెడ్డి, నాయకులు రాజారెడ్డి, కార్యకర్తలు, తదితరులున్నారు.


మిత్రుడి కుటుంబానికి అండగా..



బాధిత కుటుంబానికి రూ. 50వేలు ఇస్తున్న మిత్రులు

ఆర్మూర్, సెప్టెంబరు, 21(ఆంధ్రజ్యోతి): బాల్యమిత్రుడి కుటుంబానికి చేయుతనిచ్చేందుకు మిత్రులు రూ.50వేలు ఆర్థికసాయం చేశారు. పెర్కిట్‌కు చెందిన ధనుంజయ్ బాల్కొండ మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తు ఇటీవల విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో మృతిచెందాడు. 1998-99 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ మిత్రుని కుటుంబానికి అండగా నిల్వాలన్న ఉద్దేశంతో ఆర్థికసహాయాన్ని కూతురి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ధనుంజయ్ సతీమణి శ్రీలతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, భూమేశ్వర్, అశోక్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూలమలుపు.. ప్రమాద పిలుపు



వాగు వద్ద వంపు తిరిగి ఉన్న మూలమలుపు

ఏర్గట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులో రెండు జిల్లాల సరిహద్దులో జగిత్యాల్య జిల్లా మెట్‌పల్లి వెళ్ళే దారిలో తీగల వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోయింది. వంతెన నిర్మించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణం చేస్తుంటారు. వాగు వద్ద ప్రమాదకరమైన మూలమలుపు ఉండటంతో దానితో ఎదురుగా వస్తున్న వాహనాన్ని గమనించక వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణం చేయడానికి జంకుతున్నారు. మొన్న కురిసిన భారీ వర్షాలకు ఈ వాగును ఆనుకొని వర్షపు నీరు వరదలుగా ప్రవహించడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల రైతుల వ్యవసాయ భూములు ఎక్కువగా ఇటువైపు ఉండటంతో వారు పండించే పంటను తీసుకెళ్ళడానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, డబుల్ రోడ్డు, హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఇరు జిల్లాల ప్రయాణికులు కోరుతున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఆర్మూర్,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంకాపూర్‌లో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నిజామాబాద్‌కు చెందిన డా.శ్రీనివాస్ బృందం 170 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు, అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు గంగారెడ్డి, మురళి, వినోద్‌రెడ్డి, బాజన్న, వెంకట్ ఉన్నారు.

అశోక్‌కు సన్మానం



వేల్పూర్ , సెప్టెంబరు, 21(ఆంధ్రజ్యోతి): ఏపీలోని అమరావతిలో అక్టోబరు2న స్వచ్ఛతాన్ రన్నర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మారథాన్‌కు రేస్ అంబాసిడర్‌గా వేల్పూర్‌కు చెందిన అశోక్ ఎంపికవడంపై యువజన సంఘం యువకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం రెడ్‌రోజ్ యూత్ ఆధ్వర్యంలో అశోక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో యూత్ సభ్యుడు గంగాధర్ గౌడ్, యువకులు తదితరులు పాలొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రవీందర్, ఉపాధ్యాయులు

కమ్మర్‌పల్లి,సెప్టెంబరు21:(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి చౌక్‌బాల్ పోటీ లకు తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ధాత్రిక అక్షిత్, రేవంత్ ఎంపికైనట్లు మినిమి పాఠశాల కరస్పాండెంట్ రవీందర్, పీఈటీ సంజీవ్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టులో ఆడిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చగా జాతీయస్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ నెల 25, 28 వరకు విశాఖపట్టణంలో నిర్వహించే 16వ జూని యర్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రజట్టులోలలోలో ఆడుతారని తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను వారు అభినందించారు.

అంతర్ పాఠశాలల క్రీడల్లో విద్యార్థుల సత్తా



కబడ్డీలో గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడల్లో జక్రాన్‌పల్లి తేజస్సు విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. మార్చ్‌ఫాస్ట్‌లో ప్రథమ బహుమతిని గెలుచుకోగా.. ఎమ్మెల్యే భూపతిరెడ్డి షీల్డ్, బహుమతులు అందజేశారు. కబడ్డీ బాలుర విభాగంలో ద్వితీయ, బాలికల విభాగంలో తృతీయ బహుమతి గెలుచుకున్నారు. తేజస్వీయ డాన్స్ సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించగా చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థినిని ఎమ్మెల్యే అభినందించారు. జక్రాన్‌పల్లి, అర్గుల్, పడకల్, తొర్లికొండ, కలిగోట్ పాఠశాలల విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడల్లో సత్తాచాటి ప్రథమ, ద్వితీయస్థానాలు కైవసం చేసుకున్నారు. వివిధ పాఠశాలల జట్లకు క్రీడల ప్రారంభోత్సవం రోజున మార్చ్‌ఫాస్ట్‌లో గెలుపొందిన పాఠశాలకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి బహుమతులు అందజేయగా.. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఇతర క్రీడల్లో గెలుపొందిన పాఠశాలల జట్లకు క్రీడల ముగింపు హాజరైన నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి బహుమతులు అందజేశారు. క్రీడల కన్వీనర్ పడకల్ ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి, పీఈటీ శ్రీనివాస్, పడకల్ ప్రజాప్రతినిధులు పురుషోత్తం, శ్రీధర్, విఠల్, అరుణ్, రాజేశ్వర్‌గౌడ్ ఏర్పాట్లు చేశారు.

ప్రమాదకరంగా కల్వర్టు



రామన్నపేట్, వేల్పూర్ దారిలో ఇదీ పరిస్థితి

వేల్పూర్, సెప్టెంబరు, 21(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు వేల్పూర్ నుంచి రామన్నపేట్ వెళ్లే కల్వర్టు రోడ్డు ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. 20రోజుల క్రితం కల్వర్టు కూలిపోయి, రోడ్డు కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అధికారులు కోతకు గురైనా రోడ్డు వద్ద ఇటీవల తాత్కాలికంగా మట్టిని పోసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం అడపదడప కురుస్తున్న వర్షాలకు పోసిన మట్టి కుంగిపోయి లోతైన గుంత ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదం తప్పదనే పరిస్థితి నెలకొందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ప్రమాదం జరుగకముందే మరమ్మతులు చేపట్టాలని రామన్నపేట్ గ్రామస్థులు అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు



విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు, 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిరాయత్ నగర్‌లో ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ సాధనకు మంత్రి పదవిని సైతం త్యాజించిన గొప్ప నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని పద్మశాలి మండలాధ్యక్షుడు రాంపూర్ గంగాధర్ కొనియాడారు. తొలి, మలి దశ ఉద్యమాల్లో తెలంగాణ సాధనకు పాల్గొన్న ముఖ్య నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబాగౌడ్, తిరుపతి, సునీల్, నరహరి, శ్రీనివాస్, యగ్నేష్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలోనూ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మ్యాక మోహన్‌దాస్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్వసమాజ్ ప్రతినిధి విద్యాసాగర్, ఈఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ కౌన్సిలర్ ఖాందేష్ సంగీత శ్రీనివాస్, సత్యం పాల్గొన్నారు.

ఏర్గట్లలో..



ఏర్గట్లలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో

ఏర్గట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతినినినిని ని ఆదివారం ఏర్గట్లలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గణేష్, మాజీ ఎంపీటీసీ మధుసూదన్, శివకుమార్, మనోజ్, సందీప్, వేణు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ముప్కాల్‌లో నినాదాలు చేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

ముప్కాల్ , సెప్టెంబరు, 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘ అధ్యక్షుడు లక్ష్మీరాజ్యం, జీవన్, సుదర్శన్, చిన్నయ్య, నర్సింగ్‌దాస్, గంగాధర్, జ్ఞానేశ్వర్, నరేందర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో శ్రమదానం



పరిసరాలు శుభ్రం చేస్తున్న మహాత్మా స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఆర్మూర్ , సెప్టెంబరు, 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యాలయం చుట్టూ ఉన్న ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం పరిసరాలను నీటితో కడిగారు. అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, సభ్యులు ప్రశాంత్, నిశాంత్, రాజ్‌కుమార్, మధుసూదన్, గణేష్,నరేష్, ఎల్లయ్య, వేణు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీడీ సురేందర్‌కు సత్కారం

ఆలూర్ , సెప్టెంబరు, 21(ఆంధ్రజ్యోతి): కల్లెడలో ఆదివారం పీడీ సురేందర్‌ను గ్రామస్థులు సన్మానించారు. ఇటీవల మండలకేంద్రంలో నిర్వహించిన అంతర్ పాఠశాలల క్రీడల్లో కల్లెడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి చాంపియన్‌షిప్ సాధించారు. వీరికి శిక్షణను ఇచ్చిన పీడీ సురేందర్‌ను గ్రామస్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, లింగయ్య, పవన్, సురేఖ, సునిత, నాగభూషనం, సునీల్‌రావు, సాగర్, శ్రీవేణి, గీత, గ్రామస్థులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో గోసేవ

రుద్రూరు,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండల కేంద్రంలోని దేవీదాస్ రావు గోశాలలో ఆదివారం రుద్రూర్ మాజీ విండో ఛైర్మన్ పత్తి రాము, హరీష్ ఆధ్వర్యంలో గోసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినెలా అమావాస్య రోజున గోసేవలో భాగంగా గోవులకు బెల్లం, అరటి పండ్లు, దాణ వంటివి పెడతామని వారు తెలిపారు. ప్రతీఒక్కరు గోసేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పత్తి సాయిలు, నవీన్, శంకర్, బలరాజ్ ఉన్నారు.

యాదికే..



ప్రతి ఆడపడుచు ఆడుకునే ఆట బతుకమ్మ మాత్రమే
-పాక జ్ఞానేశ్వరి, జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు

చిన్న, పెద్ద అని తేడా లేకుండా ప్రతీ ఆడపడుచూ ఆడుకునే ఆట ఒక బతుకమ్మ మాత్రమే. చిన్నతనం నుంచి బతుకమ్మ పండుగ వచ్చిందంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న బిజీ లైఫ్‌లో మహిళలకు బతుకమ్మ ఆటలుకొంతమేర ఊరటను ఇస్తాయి. ప్రతి ఇంట్లో కనీసం ఒక్కరైన బతుకమ్మ ఆడుతూ ఎనలేని ఆనందాన్ని పొందుతారు. చివరి రోజున సద్దుల బతుకమ్మను ఊరేగింపుగా వెళ్లేవాళ్లం



పల్లె జీవనశైలిని ప్రతిబింబించేది.. బతుకమ్మ
-పిప్పిరి సుష్మ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్

పల్లె జీవనశైలిని బతుకమ్మ ప్రతిబింబిస్తుంది.బతుకమ్మ అంటేనే ఆడవారికి ఎక్కడలేని ఆనందం వస్తుంది. మా చిన్నతనంలో ఇంట్లోని పెద్దలు పంటచేన్లు, అటవీ ప్రాంతంలోకి వెళ్లి గునుగు, తంగేడు పూవ్వు తీసుకుని వస్తుండేవారు. పదుల సంఖ్యలో అందరం ఒకే దగ్గర బతుకమ్మలు చేర్చి బతుకమ్మ పాటలు పాడుకుంటూ ఆటలు ఆడుకునే వాళ్లం.



బతుకమ్మ ఆడాలంటే చాలా ఇష్టం
- కొపిరిశెట్టి కిరణ్మయి , బాన్సువాడ సబ్ కలెక్టర్

బతుకమ్మ ఆటంటే చాలా ఇష్టం. అకాడమిలో స్నేహితులతో కలిసి బతుకమ్మ సంబరాలు జరుపుకున్నాం. ఇపుడు కూడా బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటాను. ప్రతి యేటా 9 రోజుల పాటు తెలంగాణలో పండుగ వాతావరణం కనబడుతుంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చాక బతుకమ్మ ఆదరణ మరింత పెరిగింది. పెద్ద, చిన్నా తేడా లేకుండా అందరూ కలిసి బతుకమ్మ ఆడటం ఆనందంగా ఉంటుంది.





మార్కెట్లో అమ్మకానికి తీసుకవచ్చిన పప్పు దినుసులు

పప్పు దినుసులకు తగ్గిన డిమాండ్

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ జుక్కల్ నియోజక వర్గ ప్రజలతో పాటు, పక్కనున్న కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన రైతులు ఆరుతడి పంట కింద పప్పుదినుసులైన పెసర, మిను ము లాంటి పంటలను వందల ఎకరాలలో సాగు చేస్తారు. సాగు చేసిన పప్పు దినుసు పంటలైన పెసర, మినుము లాంటివి చేతికి వచ్చాయి. అయితే పంట చేతికి వ చ్చే సమయంలో భారీ వర్షాలు కురియడంతో పెసర, మినుములు పంటలు దెబ్బతిని రంగు మారాయి. దీంతో అటువంటి పంటలను అమ్ముకోవడానికి రైతన్నలు మార్కెట్‌కు తీసుకవస్తే రంగువెరసి ఉండటంతో కొనడానికి వినియోగదారులు ముందుకు రావడం లేదని రైతన్నలు వాపోతున్నారు. గత సంవత్సరం క్వింటాలుకు రూ.8 వేల వరకు ధర పలికిన పప్పు దినుసులు నేడు క్వింటాలకు రూ.5 వేల లోపే ధర వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంట చేతికి వచ్చే సమయంలో భారీ వర్షాలు కురియడంతో తాము సాగుకు ఖర్చుచేసిన డబ్బులు వస్తాయో లేదోనని దిగాలు చెందుతున్నారు. గతంలో వర్షాలు లేని సమయంలో పెసర, మినులు లాంటి పంటలను మార్కెట్‌కు తీసుకువస్తే ఒకరిపై ఒకరు పోటీ పడి కొనుగోలు చేసేవారని, ప్రస్తుతం ఎవరూ కొనలేకపోవడంతో గిరాకీ కూడకావడం లేదని ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలతో పంట సగమే చేతికి వచ్చిన బాధ ఉంటే సరియైన ధర లేక గిరాకీలు లేకపోవడంతో తమను మరింత కుంగదీస్తుందని వాపోతున్నారు.

ప్రమాద స్థలిని బాగు చేయండి సారూ



వంతెన వద్ద ప్రమాదం జరిగిన స్థలం

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 161వ జాతీయ రహదారిపై గత పక్షం రోజుల కిందట లారీ అదుపుతప్పి వంతెనను ఢీకొట్టింది. ఈ ఘటనలో వంతెన భాగం ధ్వంసం అయ్యింది. ప్రమాదం జరిగిన స్థలంలో హైవే అధికారులు సూచికలు ఏర్పాటు చేసి ఇతర వాహనాలు ఆ ప్రాంతానికి వెల్లకుండ నిరోదిస్తున్నారు. అయితే ప్రమాదం జరిగి పక్షం రోజుల పైనే కావస్తున్న ప్రమాదం జరిగిన స్థలాన్ని మరమ్మత్తులు చేయడంలో జాప్యం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన స్థలంలో సూచికలు ఉన్న అవి ఎన్నిరోజుల పాటు ఉంటాయని వాహనదారులు సంశయం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా హైవే అధికారులు స్పందించి ప్రమాద స్థలిని మరమ్మత్తులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

బీర్కూర్‌లో తాగునీటి సమస్యకు చెక్



బీర్కూర్ శివారులో బోరు బావిలో మోటార్ దింపుతున్న జీపీ సిబ్బంది

బీర్కూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్‌లో కొన్ని రోజుల క్రితం తాగు నీటి సమస్య తలెత్తింది. మంజీరా నది వద్ద గల బోరు మోటార్ చెడిపోయింది. దీంతో తాగునీరు సరఫరా కాకా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగు నీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు జీపి కార్యదర్శి గంగారాంకు నివేదించారు. అయితే ఆదివారం పాత మోటార్ తొలగించి కొత్త మోటార్‌ను అమర్చారు. దీంతో తాగు నీటి సమస్యకు చెక్ పెట్టినట్లయింది. కొత్త మోటారు పంపు సెట్టును అత్యవసరముగా కొనుగోలు చేసి బావిలో దింపాలని కార్యదర్శి గంగారాం తెలిపారు. దీంతో గ్రామంలో తాగు నీటి సరఫరా సక్రమంగా జరుగుతుందని ఆయన తెలిపారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం



బూర్గుపల్లిలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనం

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరింది. ఈ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణతోపాటు, గర్భిణిలు, బాలింతలకు అవసరమైన సేవలను అందిస్తుంటారు. 20 సంవత్సరాల కిందట నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో ఈ భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉండటంతో సంబంధిత అధికారులు దీనిని మూసి వేసి చావిట్లో అంగన్‌వాడీ పాఠశాలను నిర్వహిస్తున్నారు. శాశ్వత పరిష్కార మార్గంగా కొత్త భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

నవరాత్రోత్సవాలకు మండపాల ముస్తాబు

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రోత్సవాల కోసం పట్టణంలోని ఆయా కాలనీల్లో నిర్వాహకులు మండపాలను ముస్తాబు చేశారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి పూజలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. చైతన్య కాలనీలో మండపాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.



మండపాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

నేటి నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు
- రోజుకో రూపంలో దర్శనమివ్వనున్న అమ్మవారు
- ముస్తాబైన మంటపాలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అమ్మ జగత్‌జనని మమ్మల్ని రక్షించుతల్లి అనగానే తన సంతానాన్ని రక్షించేందుకు అ మ్మ దివి నుంచి భువికి దిగి వచ్చి భక్తులను రక్షిస్తుంది. భక్తుల పాలిట వరప్రదాయనిగా మహిళలకు పది కాలాల పాటు పసుపు కుంకుమలతో ముత్తైదువతనాన్ని అందించే తల్లిగా కొలుస్తారు. ప్రతియేటా దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో 9 రోజుల పాటు వివిధ రూపాల్లో అమ్మవారిని పూ జించడం భక్తులు ప్రత్యేకంగా భావిస్తారు. జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అశ్వీయుజ శుక్ల ప్రతిపద మొదలుకొని నవమి వరకు తొమ్మిది రాత్రులను నవరాత్రులుగా వ్యవహరిస్తారు. ఆశ్వయుజ పాడ్యమి నుంచి ప్రారంభమయ్యే దేవినవరాత్రి ఉత్సవాలు విజయదశమి వరకు జరుగుతాయి. హిందూ సంప్రదాయంలో శక్తి స్వరూపిణి అయిన పార్వతి అవతారాలలో నవదుర్గాలు ముఖ్యమైనవిగా భావిస్తారు. ప్రతీ అవతారం నుంచి మరొక రెండు రూపాలు వెలువడి మొత్తం తొమ్మిది రూపాలలో నవ దుర్గలుగా భావిస్తారు. మహిళలు, పురుషులు ఈ తొమ్మిది రోజుల పాటు కటోర ఉపవాస దీక్షలు నియమనిబంధనలు పాటిస్తూ అమ్మవారిని కొలుస్తారు. మంటపాల్లో ఉదయం, సాయంత్రం విశేష పూజలు నిర్వహిస్తారు.

మొదటి రోజు శైల పుత్రి (దుర్గాదేవి)

సతీదేవి యోగాగ్నిలో తనువును త్యజించి పిరపర్వత రాజైన హిమవంతుని ఇంట పుత్రికయై అవతరించినందున ఆమెకు శైలపుత్రి అనునామం. వృషభ వాహన రూఢయైన ఈ మాతకు కుడి చేతిలో త్రిశూలం, ఎడమ చేతిలో కమలం విరాజిల్లుతుంది. తలపై చంద్రవంక ధరిస్తుంది. శైలపుత్రి మహిమలు, శక్తులు అనంతం, వాంచితములను తీర్చే తల్లి.

ప్రసాదం: చలిమెడి వడపప్పు, పాయసం

రెండో రోజు : బ్రహ్మచారిణి (బాల త్రిపురసుందరి)

బ్రహ్మచారిణి యగు తపస్సును ఆచరించిన తల్లి బ్రహమునందు చ రించునది, కుడిచేతియందు జపమాలను, ఎడమచేతియందు కమండలం ధరించును. పరమేశ్వరుని పత్నిగా అవుటకు తీవ్రమైనటువంటి తపస్సును ఆచరించిన తల్లి. ఈ తల్లిని పూజించిన సర్వసిద్ధి, విజయప్రాప్తి కలుగును.

ప్రసాదం: తీపి బూంది, శనగలు.

మూడో రోజు : చంద్రఘంట (గాయత్రీమాత)

శిరస్సు నందు అర్ధచంద్రం కలిగిన తల్లి చంద్రఘంట దేవి. శరీరం బంగారు కాంతితో పది చేతులను కలిగి ఉంటుంది. పది చేతుల్లో ఖడ్గం, బాణం మొదలగు అస్త్రములను ధరించినది. భయం, బాధల నుంచి విముక్తి కలించునది. ప్రసాదం: రవ్వకేసరి, పులిహోర.

నాల్గవ రోజు: కూష్మాండ (మహాలక్ష్మి)

బ్రహ్మాం చే పుట్టినటువంటి తల్లిగా విరాజిల్లుతున్నది కూష్మాండదేవి. ఈ దేవి విఖ్యాతమైనటువంటి సూర్యమండలంలో అంతర్లీనంగా ఉండేతల్లిగా ప్రసిద్ధి చెందింది. చేతుల్లో కమండలం, ధనస్సు, బాణం, కమలం, అమృత కలశం, చక్రం, గద, ఖడ్గం వంటి ఆయుధాలు కలిగి ఉన్నది. ఆయురారోగ్యాలను వృద్ధి చెందించునది ఈ తల్లి.

ప్రసాదం: క్షీరాన్నం, పొంగలి.



దేవిమాతా ఆలయం



వాసవీ మాతా ఆలయం

ఐదో రోజు: స్కంద మాత (లలితాదేవి)

కుమార స్వామికి అవతారంగా చెప్పబడుతున్న తల్లి స్కందమాత. షణ్ముఖుడైన బాలస్కందుడిని ఈమె తన ఒడిలో ఉంచుకోవడం చే ఈమెకు స్కంద మాతగా పేరున్నది. మరొక చేతితో పద్మమును ధరించును. దివ్యతేజస్సు, స్వచ్ఛ కాంతులతో విరాజిల్లుతోంది. ఈ తల్లిని పూజిస్తే సకల సౌందర్యం కలుగుతుందని ప్రతీక.

ప్రసాదం: పులిహోర, పెసరి బూరెలు.

ఆరో రోజు: కాత్యాయనీ (అన్నపూర్ణదేవి)

బ్రహ్మ, విష్ణు, మహేశ్వర తేజస్సుతో కాత్యాయన మహాఋషి పుత్రికగా కాత్యాయనీ అవతరించింది. సప్తమి, అష్టమి,నవమి తిథుల యందు కాతీయనిగా భక్తుల పూజలను అందుకుంటుంది. రోగం, సంతానం, వంటి వాటికోసం అమ్మవారిని ఆరాదించాలి.

ప్రసాదం: పొంగలి.

ఏడవ రోజు : కాళరాత్రి (సరస్వతి దేవి)

కాళరాత్రి శరీర వర్ణంచే ఈ తల్లికి కాళరాత్రి వచ్చింది. కుడిచేత అభ య, వర ముద్రతో, ఎడమ చేత ఇనుప ముండ్ల ఖడ్గం ఆయుధాలను ధరించి ఉంటుంది. శత్రు భయాలను తొలగించే తల్లిగా ప్రసిద్ధి చెందింది. చదువుల తల్లిగా, సరస్వతి మాతగా విరాజిల్లుతోంది.

ప్రసాదం: అటుకులు, బెల్లం, పులిహోర.

ఎనిమిదో రోజు : మహాగౌరి (దుర్గాదేవి)

గౌరి వర్ణంతో శంఖం వంటి ఆయుధాలతో మహాగౌరిగా విరాజిల్లుతోం ది. కుడిచేతిలో అభయ ముద్ర, త్రిశూలం, ఎడమ చేతిలో డమరుకం కలిగి ఉండును. కష్టాలను తొలగిస్తుంది.

ప్రసాదం: గారెలు, పొంగలి.

తొమ్మిదో రోజు: సిద్ధిరాత్రి (మహిషాసుర మర్దిని)

సర్వసిద్ధులను ప్రసాదించే తల్లి సిద్ధిదాత్రి. కుడిచేత చక్రం, గద, ఎడమచేతిలో శంఖం, కమలం ధరించినది ఈ తల్లి. తల్లిని ఆరాధిస్తే సకల సిద్ధులు కలుగుతాయి.

ప్రసాదం: పులిహోర.

ముస్తాబైన మంటపాలు..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వాహకులు మం టపాలను అలంకరణతో ముస్తాబు చేస్తారు. అమ్మవారిని రోజుకొక రూ పంలో దర్శించుటకు వీలుగా అలంకరణలతో ఆలయ పూజారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. నైవేద్యం, చీరలను, ప్రత్యేక ఆకర్షణగా నిలిచే విధంగా ఆలయ కమిటీలు తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దేవీమాత ఆలయం, లలిత దేవి, వాసవి కన్యకపరమేశ్వరి, దుబ్బలోని మహాలక్ష్మి ఆలయం, హిం గులాంబికా దేవి, తుల్జాభవాని ఆలయాలు ముస్తాబు అయ్యాయి.

ప్రకృతితో మమేకమయ్యే వేడుక.. బతుకమ్మ

- పూల పండుగలో పూలకు ప్రత్యేకత విశిష్టత
- బతుకమ్మలో ఉపయోగించే ప్రతీ పువ్వు ఔషదమే



నాందేవ్‌వాడ సాయిబాబా ఆలయంలో బతుకమ్మలతో మహిళలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పూల పండుగగా తెలంగాణ ఆడపడుచులు జరుపుకునే బతుకమ్మలో పూలకు ప్రత్యేక స్థానం ఉంది. బతుకమ్మ వేడుకల్లో ఉపయోగించే ప్రతి పువ్వు ఔషద గుణాన్ని అందిస్తుంది. రుతుసంబంధంగా వచ్చే మార్పులకు ఈ పండుగ అందరికి ఆరోగ్యాన్ని అందించే వేడుకగా నిలుస్తుంది. బతుకమ్మ పండుగలో ఉపయోగించే తంగేడు, గునక పువ్వు, గడ్డి పూలు, కట్లపూలు, బంతి, గుమ్మడిపూలు, మాసంలో లభించే పూలతో బతుకమ్మలను తయారు చేస్తారు. బతుకమ్మను పేర్చేటప్పుడు ప్రతి పువ్వు ఉండే విధంగా చూసుకుంటారు. వెదరు ఆకు, అల్లిన సిబ్బి తాంబూలంలో బతుకమ్మను తయారు చేస్తారు. బతుకమ్మను తయారు చేసేటప్పుడు గునక పువ్వు ఒక వరుస, తంగేడె, గడ్డి పూలు, కట్లపూలు, బంతి, గుమ్మడిపూలు, మాసంలో లభించే పూలను ఒక్కొక్క వరుసగా వచ్చే విధంగా త్రికోణాకారంలో పేరుస్తారు. పలు చోట్ల గునక పువ్వును వివిధ రంగులను అద్ది పేర్చడంతో బతుకమ్మకు కొత్త శోభ సంతరించుకుంటుంది.

ప్రకృతితో మమేకమయ్యే పండుగ..

బతుకమ్మ పండుగ ప్రకృతితో మమేకమయ్యే పండుగగా జరుపుకుంటారు. బతుకమ్మ పేర్చేటప్పుడు ఉపయోగించే ప్రతి పువ్వు ఔష గుణాన్ని కలిగి ఉంటుంది. పూల వాసన ఆస్వాదించిన వాటిని చేత్తో పట్టుకున్న ఔషదగుణాలు మనకు అందిస్తాయి. ప్రతీ పువ్వు ఆయుర్వేదం, హోమియోతో పాటు అలోపతి వైద్యంలో విరివిరిగా ఉపయోగిస్తారు. గునుక పువ్వు సాధారణ వ్యాధులు, మధుమే హం, నోటి పుండ్లు, ముక్కులో రక్తస్రావం తగ్గడానికి, గాయాలు నయమవడానికి, అతిసారా వంటి వ్యాధులు నయం చేయడానికి ఉపయోగిస్తారు. తంగేడు పువ్వు చర్మవ్యాధులు, ముక్కుపట్టడం, దగ్గు, గొంతుపట్టడం వంటి వ్యాధులు నయం చేయడానికి, గుమ్మడి పూలు రోగనిరోధక శక్తి, కంటిచూపు, కట్లపూలు శ్వాస, కిరణజన్య సంయోజక వంటి వాటిలో, గడ్డిపూలు చర్మసంబంధ వ్యాధి, బంతిపూలు వివిధ రకాల ఔషదాల్లో ఉపయోగిస్తారు. నాటటి కాలంలో బతుకమ్మ వేడుకల్లో ఈ పూలను ఉపయోగించడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని శాస్త్రీయ ధృక్పధంతో పూలను ఎంపిక చేసి బతుకమ్మ వేడుకలను సంబురంగా జరుపుకు నే సాంప్రదాయాన్ని అందించారు.

అమ్మకానికి సిద్ధంగా దేవి విగ్రహాలు



అమ్మకానికి దుర్గాదేవి విగ్రహాలు సిద్ధం

మద్నూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో నేటి నుంచి దసరా శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. దీంతో ఉమ్మడి మండలాల్లోని పలు ఆలయాలు మండపాల వద్ద అమ్మవారి నవరాత్రులు ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రులకు ప్రత్యేక మండపంతో పాటు ప్రాంగణానికి రంగులు వేస్తున్నారు. ఉమ్మడి మండలంలో పలువురు మండప నిర్వహకులు ముందుగానే అమ్మా వారి విగ్రహాలు కొనుగోలు చేశారు. ఈ ఏడాది మొత్తం 11 రోజులు అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. కొందరు ఈ పండుగ మొదటి మూడు రోజులు పార్వతీదేవిని, తర్వాత మూడు రోజులు లక్ష్మీదేవిని, ఆ తర్వాత మూడు రోజులు సరస్వతి మాతకు పూజలు నిర్వహిస్తారు. నవరాత్రులు సామాన్యుల నుంచి యోగుల వరకు అమ్మవారిని పూజిస్తారు. తొమ్మిది రోజుల్లో అమ్మవారు తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనం ఇస్తారు. లోక కళ్యాణం కోసం అమ్మవారు ఒక్కో రోజు. ఒక్కో రూపంలో దర్శనం ఇస్తారు. ప్రకృతి ఆధీనంలో ఉండాలని అందరూ క్షేమంగా ఉండాలని అమ్మవారిని వేడుకుంటారు. అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు ఉదయం, సాయంకాలం రెండుసార్లు భక్తిశ్రద్ధలతో దేవిమాతకు పూజలు అ ర్చనలు చేస్తుంటారు. అమ్మవారి మండపాల వద్ద రాత్రులు భజనలు, కోలాటాలు ఆడుతుంటారు బతుకమ్మ ఆటలను ఆడుతూ అమ్మను కొలుస్తారు. చండీ హోమాలు, లక్ష్మీ గణపతి దుర్గా, రుద్ర హోమాలు నిర్వహిస్తారు. మండపాల వద్ద పారాయణాలు చేస్తూ అమ్మవారిని ఆరాధిస్తారు. దేవి శరన్నవరాత్రుల సందర్భంగా భక్తులు, నియమ నిష్టలతో ఆధ్యాత్మిక చింతన ద్వా రా మానసిక ప్రశాంతత ప్రాప్తిస్తుందని నమ్మకంతో పూజలు నిర్వహిస్తారు.

పలు గ్రామాల్లో కంది రైతుకు తీవ్ర నష్టం



ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఎదగని కంది పంట

జుక్కల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన సోయా పంటలో అంతర్ పంటగా కంది పంట సాగు చేస్తారు. సెప్టెంబర్ నెలలో భారీ వర్షాలు కురవడంతో పంట పొలాల్లో నీరు నిలువ ఉండి కంది మొక్కలు ఎదగకుండా పోయాయి. జుక్కల్ మండలంలో రైతులు ప్రతి సంవత్సరం మెట్ట నల్లరేగడి భూముల్లో సోయా పంటతో కలిపి కంది పంట సాగు చేస్తారు. వర్షాలు ఎక్కువ కావడంతో కంది పంటకు నీరు పట్టి మొక్కలు చనిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు సాగు చేయడానికి రైతులు పెట్టుబడులు పెట్టి లాభాల వస్తాయనుకుంటే రైతుల ఆశలు ఆవిరి అయినట్టు రైతులు పేర్కొన్నారు. నల్లరేగడి భూములకు వర్షాలు తక్కువగా కురిసి అడపాదడపా తక్కువ వర్షాలు కురిస్తే కంది పంట పుష్కలంగా పెరిగే అవకాశం ఉంది కొందరు రైతులు భూములను లీజుకు తీసుకొని సోయా పండుతోపాటు కంది పంట సాగు చేసుకున్నారు. చేతికి వచ్చే కంది పంట వర్షాలు ఎక్కువ కావడంతో మొక్కలు చనిపోతున్నాయి. జుక్కల్ మండలంలో రైతులు ఆరుతడి పంటలు ఎక్కువగా సాగు చేస్తారు. పత్తి, సోయా, కంది, మిర్చి వివిధ పంటలు సావు చేసి లాభాలు పొందుతారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు దిగులు చెందుతున్నారు. వర్షాలు విపరీతంగా కురవడంతో పంట పొలాల్లో నీరు నిలువ అధికంగా ఉంటుంది. దీంతో సోయా పత్తి పంటలు పెరగడం లేదని రైతులు దిన దినం దిగులు చెందుతున్నారు. గత సంవత్సరం కంటే ప్రస్తుత సంవత్సరం వర్షాలు ఎక్కువగా నమోదు కావడంతో పంటలు అభివృద్ధి చెందుతాలేవని రైతులు ఒకరితో మరొకరు చెప్పుకుంటున్నారు. భూమి లీజు తీసుకున్న రైతులు పెట్టిన పెట్టుబడి వచ్చే అవకాశాలు లేనందున భూమి లీజు డబ్బులు నష్టపోవాల్సి వస్తుందని కౌలు రైతులు దిగులు చెందుతున్నారు. ప్రభుత్వ వ్యవసాయ అధికారులు పంట పొలాలను పర్యటించి పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం చెల్లించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాలనీ రోడ్డు ఇలా.. మరి నడిచేదెలా?

- వాహనాల రాకపోకలకూ తప్పని ఇబ్బందులు
- అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో అదో పేరుమోసిన కాలనీ. చాలా మట్టుకు ఉద్యోగస్తులు ఇక్కడే స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. కానీ ప్రతీ యేటా వర్షాకాలంలో రోడ్డు సక్రమంగా లేకపోవడంతో వారు నానా అవస్థలు పడుతున్నారు. మరో దారి గుండా పోదామనుకుంటే ఆ దారిలో ట్రాఫిక్‌జాం నిత్యకృత్యంలా మారింది. అది ఎక్కడో కాదండోయ్... బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ. ఈ కాలనీ మొదటి వార్డు కింద వస్తుంది. బస్టాండ్ నుంచి కాలనీలోకి వెళ్లే దారి ఇరుకు గా ఉండడం, దానికి తోడు ప్రతీ రోజు వాహనాల పార్కింగ్ స్థానికులకు తలనొప్పిగా మారింది. ఆ దారిలో రావాలంటేనే జంకాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోనీ మరో దారి గుండా వెళ్దామనుకుంటే ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలమయంగా మారింది. అంతేకాకుండా కనీసం నడవడానికి కూడా వీలుగా లేకుండా పోయింది. మున్సిపల్ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తైనా చేడటం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీకి మరో దారి లేకున్నా తాత్కాలికంగా ఉన్న రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతిన్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలనీరోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన దృశ్యం



కాలనీ రోడ్డులో గుంతలు ఇలా



నాందేవ్‌వాడ సాయిబాబా ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



వాసవి మాత ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఘనంగా ఎంగిలి పువ్వుల బతుకమ్మ

- బతుకమ్మ ఆటపాటలతో గౌరీ దేవతలకు పూజలు
- బతుకమ్మ ఆడిన మహిళలు

నిజామాబాద్‌కల్చరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎంగిలి పువ్వు బతుకమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రతియేటా భాద్రపద అమావాస్య నుంచి ప్రారంభమయ్యే ఈ వేడుకలను మహిళలు సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ వివిధ రకాల పూలను పేర్చి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. ఒక్కేసి పువ్వేసి చందమామా.. మూడు జాములాయే చందమామా అంటూ బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. ఆలయాలతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద మహి ళలు తోటి మహిళలతో కలిసి బతుకమ్మ ఆటపాటలతో పూజించారు. గౌరీ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నువ్వులు, బియ్యం పిండిని సమర్పించుకున్నారు. బతుకమ్మను నీటిలో నిమజ్జనం చేసి ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం, హమాల్‌వాడి సంతోషి సాయి బాబా ఆలయం, బ్రహ్మపురి,ఎల్లమ్మగుట్ట, తదితర ప్రాంతాల్లోబతుకమ్మ వేడుకలు నిర్వహించుకున్నారు.

నేడు అటుకుల బతుకమ్మ

రెండో రోజున అటుకుల బతుకమ్మను పూలతో రెండు అంతరాలుగా పేర్చి అటుకులు, బెల్లం, సప్పడి పప్పును నైవేద్యంగా సమర్పిస్తారు.



బతుకమ్మ ను నిమజ్జనానికి తీసుకెళ్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కళాశాలలో బతుకమ్మ సంబురాలు

ఆర్మూర్: జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల జూనియర్, మహిళ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఈ సందర్భంగా రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి అధ్యా పకులు, విద్యార్థినులు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థినులు, అధ్యాపకులు బతుకమ్మ ఆడి చెరువులో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరుచూరి అనూష, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పండుగకు పస్తులేనా?

(5వ పేజీ తరువాయి)

ఇంకా స్కావెంజర్లకు అందలేదు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి స్కావెంజర్లకు వేతనాలు ఇస్తున్నారు. 30 మంది లోపు విద్యార్థులు ఉంటే రూ.3వేలు, 100లోపు విద్యార్థులు ఉంటే రూ.6వేలు, 250 వరకు విద్యార్థులు ఉంటే రూ.8వేలు, 500 మంది విద్యార్థులు ఉంటే రూ. 12వేలు, 750 మంది విద్యార్థులు ఉంటే రూ.15వేలు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది. గతంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం స్కావెంజర్లను తొలగించగా కాంగ్రెస్ ప్రభుత్వం స్కావెంజర్లను నియమించింది. కానీ రిజిస్టార్ లలో ఎక్కడ కూడా స్కావెంజర్ల పేర్లు నమోదు చేయవద్దని మెలిక పెట్టింది. రిజిస్టార్‌లో పేర్లు ఉంటే రెగ్యులర్ వేతనాల కోసం ఆందోళన చేసే అవకాశాలు ఉండడంతో ముందు జాగ్రత్తగా ప్రభుత్వం స్కావెంజర్లను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా వేతనాలు ఇచ్చేలా ఏర్పాట్లు చేసింది. పాఠశాల కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుల పేరుపై ఉన్న జాయింట్ బ్యాంక్ అకౌంట్ ఖాతాలో డబ్బులు జమచేసి స్కావెంజర్లకు వేతనాలు ఇస్తున్నారు మరో వారం రోజుల్లో బతుకమ్మ, దసరా పండుగలు ఉన్న నేపథ్యంలో వేతనాల కోసం స్కావెంజర్లు ఎదురుచూస్తున్నారు.

జీపీ కార్మికులకు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లది అదే పరిస్థితి

ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్‌అసిస్టెంట్లతో పాటు గ్రామపంచాయతీ కార్మికులకు సైతం ప్రతినెలా వేతనాలు అందడం లేదు. ఉపాధి హామీ కూలీలకు గత రెండు నెలలుగా వేతనాలు అందాల్సి ఉండగా గ్రామపంచాయతీ కార్మికులకు మాత్రం మూడు నెలలుగా వేతనాలు రాలేదు. జిల్లా వ్యాప్తంగా 2786 మంది గ్రామపంచాయతీ వర్కర్లు ఉండగా వారికి ప్రతినెలా రూ.9500 చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 350 మంది ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు వీరికి రూ. 12వేలు చెల్లిస్తున్నారు వీరికి గత జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన వేతనాలు ఇంకా అందలేదు. ఇచ్చేదే తక్కువ వేతనం అది కూడా నెలనెలా ఇవ్వకపోవడంతో చిరు ఉద్యోగులు మూడు నెలల పాటు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. పండగలు, ఇతర అవసరాలు, అనారోగ్య సమస్యల కోసం చిరు ఉద్యోగులు అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి పండగకు ముందే వేతనాలు చెల్లించాలని చిరు ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కాపర్ కేటుగాళ్లు!

(5వ పేజీ తరువాయి)

తరచూఇలాంటి సంఘటనలు జరుగుతున్న ఇటు పోలీసుల నుంచి, లిఫ్ట్ కమిటీల నుంచి, ఇరిగేషన్ అధికారుల నుంచిఎలాంటి స్పందన ఉండటం లేదు.

తరచూ దొంగతనాలతో రైతులకు ఇబ్బందులు

ఎత్తిపోతల పథకాలలో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి దుండగులు దొంగతనాలకు పాల్పడుతుండటంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేయించే వరకు రైతులకు సాగునీరు అందకపోవడంతో వేల ఎకరాల్లో నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. తరచూ దొంగతనాలు కావడంతో ట్రాన్స్‌ఫార్మర్లను ఎలా కాపాడాలో తెలియక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు పోలీసులకు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన ఇటువైపు గస్తీ తిరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎస్సైల్‌లో దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

బహిరంగ మార్కెట్‌లో కాపర్‌కు కిలో వెయ్యి రూపాయలు

కాపర్‌కు బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో దుండగులు ఎవరూ లేని చోట దొంగతనాలకు పాల్పడి పరారీ అవుతున్నారు. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ మొత్తం నిర్మానుష్య ప్రాంతం కావడంతో అక్కడ ఎవరూ సంచరించకపోవడంతో ఎత్తిపోతల పథకాలను టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. కాపర్‌కు బహిరంగ మార్కెట్‌లో కిలోకు సుమారు వెయ్యి రూపాయల చొప్పున అమ్ముతున్నారు. దీంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ కూడా లీటర్‌కు వంద రూపాయల చొప్పున అమ్ముతూ దుండగులు సొమ్ము చేసుకుంటున్నారు.

పదుల సంఖ్యలో దొంగతనాలు జరిగినా చర్యలు శూన్యం...

నీటి ఎత్తిపోతల పథకాలలో పదుల సంఖ్యలో దొంగతనాలు జరిగిన ఇటు ప్రభుత్వం నుంచి, అధికారుల నుంచి చర్యలు మాత్రం శూన్యంగా కనిపిస్తుంది. లిఫ్ట్ ఇరిగేషన్‌లో దొంగతనాలు కాకుండా వాచ్‌మెన్‌లైనా, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా అలాంటివేమీ లేకపోవడంతో దొంగతనాలకు లిఫ్ట్ ఇరిగేషన్‌లు అడ్డాగా మారాయి. అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏ ఒక్క లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయలేదు. దీంతో ఒకదానివెంబడి ఒకటి లిఫ్ట్ ఇరిగేషన్‌లో దుండగులు దొంగతనాలకు పాల్పడుతున్నారు.

పాఠశాలపై నుంచి దూకిన విద్యార్థి

(5వ పేజీ తరువాయి)

మళ్లీ చీటీలు కొట్టనని లెటర్ రాయించుకుని పాఠశాల యాజమాన్యం తిరిగి విద్యార్థి చేత పరీక్షను నిర్వహిం చారు. తండ్రి తనను మందలిస్తాడని ఉద్దేశంతో విద్యార్థి సుమిత్ బయపడి భవనం 2వ అంతస్తు పైనుంచి దూకాడు. గమనించిన పాఠశాల యాజ మాన్యం వెంటనే విద్యార్థిని దగ్గరలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా రెండంతస్తుల భవనం నుంచి దూకడంతో కాళ్లు విరిగినట్టు తెలుస్తోంది. కాళ్లు దవడ విరిగి ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు చెబుతున్నారు. విద్యార్థి తండ్రి బాలాజీ మాట్లాడుతూ భవనం పైనుంచి దూకిన ఘటనలో యాజమాన్యం తప్పేమీ లేదని తమ కుమారుడు చీటీలు కొడుతూ పట్టుపడగా ఆ విషయం హెచ్‌ఎం నాకు ఫోన్ ద్వారా తెలిపారు. నాకు చెప్పాడని భయంతో తన కుమారుడు క్షణికావేశంలో భవనం పైనుంచి దూకాడు ఈ విషయంలో మేనేజ్మెంట్ మా అబ్బాయి ఆరోగ్యం మెరుగుపరచడం కోసం అన్ని విధాల సహకరిస్తున్నారు. ఈ ఘటన విషయమై 4వ టౌన్ ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ అడగగా యాజమాన్యం తప్పేమీ లేదన్నారు. విద్యార్థులను మందలించడం ఉపాధ్యాయులుగా వారి బాధ్యత నిర్వహించారని తల్లిదండ్రులు సైతం ఎలాంటి కేసు పెట్టడానికి ఇష్టం లేకపోయినా పాఠశాల యాజమాన్యం విద్యార్థి తండ్రిని తీసుకువచ్చి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇప్పించినట్లు తెలుస్తోంది. ఎస్సై సైతం విద్యార్థితోపాటు విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడినట్టు తెలిపాడు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఈ విషయంపై వివరణ అడగగా తాను ఆసుపత్రికి వెళ్లి తండ్రితోని విద్యార్థితో మాట్లాడానని పాఠశాలలో సంఘటనకు సంబంధించి వీడియో ఫుటేజ్ తీసుకున్నానని తెలిపారు. ఈ ఘటనపై విద్యార్థి సంఘాలు ఆసుపత్రి ఎదుట ఆందోళన నిర్వహించి విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశాయి.

సాయుధ పోరాట యాదిలో
కళాకారులు ఆట పాట



పాటలు పాడుతున్న కళాకారులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కవులు, కళాకారుల పాత్రపై నిర్వహించిన పాట ఆట ఆలోచింపజేసింది. సాంస్కృతిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో అరుణోదయ ప్రజానాట్యమండలి అరుణోదయ సాంస్కృతిక సమైక్య కళాకారులు ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి రాధాకిషన్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా మేకల రామస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నిజాం ప్రభుత్వ సైన్యాధిపతిగా ఉన్న ఖాసీం రాజ్వీ తెలంగాణ ప్రజలను కమ్యూనిస్టులను సుమారు 2వేల మందికి పైగా చంపారని వేలాది మంది మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డాడని అన్నారు. ఎర్రజెండ నీడలో ప్రజలను జాగృతం చేసి 300 గ్రామాల్లో స్వరాజ్యాలను ఏర్పాటు చేసి 10లక్షల ఎకరాల భూమిని ప్రజలు స్వాధీనం చేసుకునే విధంగా చేశారని అన్నారు. తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తి భారతదేశాన్ని ఆలోచింపజేసిందని దేశంలో అనేక ప్రాంతాల్లో పోరా టాలకు మార్గాన్ని చూపింది తెలంగాణ సాయుధ పోరాటం అని అన్నారు. బండెనక బండి కట్టి 16 బండ్లు కట్టి ఏ బండ్లో వస్తావు కొడుకో సర్కా రోడా, ఇదే నండీ ఇదే నండీ తెలంగాణ కమ్యూనిస్టు గుండె కాయ కష్టజీవి కలల కోణ కళాకారుల పాట ఆటతో హోరెత్తించారు. డప్పు, డోలు, నృత్యం, తెలంగాణ బ్యాలే దృశ్యాలు, పాండవుల కళాకారుల పాట, భజన కళాకా రులు ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు సిర్పలింగం, అరుణోదయ కళాకారులు అబ్దుల్ గంగాధర్, నథా నియల్, గోపాల్, నర్సయ్య, పోశెట్టి, మార్క్స్, శ్యామ్, గంగారాం, శివశంకర్, ప్రజానాట్య మండలి కళాకారుడు లక్ష్మణ్, అంజన్న, నర్సింగ్, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



పూలమాల వేస్తున్న బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కార్తిక్



ధర్పల్లిలో కొండ లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న నాయకులు



బోర్గాం(పి)లో కొండా లక్ష్మణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా నగరంలోని వినాయక్‌నగర్ విగ్రహాల పార్క్ వద్ద బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్నాటి కార్తిక్ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్తిక్ మాట్లాడుతూ తెలంగాణకు కొండాలక్ష్మణ్ బాపూజీ జాతి పిత అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి కీలకంగా వ్యవహరిస్తూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయులు అన్నారు. తెలంగాణ తొలి మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసి తెలంగాణ పీపుల్స్ పార్టీ స్థాపించి ప్రత్యేక రాష్ట్ర కాంక్షను చాటుతూ తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఆయన నివాసం జలదృశ్యంలోనే పురుడు పోసుకుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సా ధనకు యువత కృషి చేయాలని వారి అడుగు జాడల్లో నడిచి బాపూజీ కలలు కన్న తెలంగాణ నిర్మాణానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు బొట్టు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

మజ్దూర్ జనతా పార్టీ ఆధ్వర్యంలో

కొండాలక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని మజ్దూర్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల విగ్రహాల పార్కులో మజ్దూర్ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపెల్లిశ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పిం చారు.పేద,మధ్యతరగతి ప్రజలకు ఆర్థికసంక్షేమం కోసం ప్రభుత్వ బడ్జెట్ లో యేటా 25 శాతం ఆర్థిక వాటా సాధనే లక్ష్యంగా మజ్దూర్ జనతా పార్టీ ఏర్పడిందని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, బొడ్డుగంగాధర్, రాజేందర్, మురళి పాల్గొన్నారు.

మోపాల్: నగరంలోని బోర్గాం(పి) గ్రామంలోని పద్మశాలి సంఘం 62వ తర్ప ఆధ్వర్యంలో ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఘన నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి రచ్చ ఆనంద్, కోశాధికారి వేముల విశ్వనాథ్, ఉపాధ్యక్షుడు గూడ నర్సింలు, సహాయ కార్యదర్శి వేమూరు నర్సింహస్వామి, రచ్చ శీను, అంజనేయులు, సంఘ సభ్యుడు పాల్గొన్నారు.

ధర్పల్లి:ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 21వ వర్ధంతిని మండల కేంద్రంలో ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ విగ్రహానికి పూలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు పాము నారాయణ, జిల్లా కార్యదర్శి చిలుక సాయిలు, మండల అధ్యక్షుడు డాక్టర్ నందు, దువ్వ భూమేష్, చాట్ల రవి, మహేందర్, స్వామి, రాము, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ఎన్నికల్లో
ఏబీవీపీ విజయంపై సంబరాలు



నినాదాలు చేస్తున్న ఏబీవీపీ నాయకులు

సుభాష్‌నగర్,సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్ ఎన్నికల్లో ఏబీవీపీ ప్యానల్ ఘనవిజయం సాధించడం పై జిల్లా ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద ఆదివారం బాణాసంచా పేల్చి ఒకరినొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు శివ మాట్లాడుతూ హెచ్‌సీయూ ఎన్నికల్లో ఏబీవీపీ ప్యానల్ అన్ని స్థానాల్లో క్లీన్‌స్వీప్ చేస్తూ ఘనవిజయం సాధించడం ఎంతో శుభసందర్భం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీ వీపీ జిల్లాకన్వీనర్ బాలకృష్ణ, విభాగ్ సోషల్ మీడి యా కన్వీనర్ సునీల్, టీయూ కార్య దర్శి సమీర్, కంఠేశ్వర్ జోనల్ ఇన్‌చార్జి దుర్గాదాస్, ఏబీవీపీ నాయ కులు అశోక్, అనిల్, జగదీశ్, అభిలాష్, రాము, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు,పురుగు మందులపై అవగాహన



మందులను పరిశీలిస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

సిరికొండ,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):విత్తనాల ఎంపిక, పురుగు మందులు వినియోగంపై క్షేత్ర స్థాయిలో పర్యటనలో భాగంగా సిరికొండలో గల ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాన్ని సందర్శించి మోడల్‌స్కూల్ విద్యార్థులు అవగాహన చేసుకున్నారు. మండలంలో గల పీఎం శ్రీఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆదివారం వ్యవసాయ ఉపాధ్యాయులు జాడి సాయి వినయ్ ఆధ్వర్యంలో ఆగ్రోస్‌రైతు సేవకేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. పంటల సాగులో విత్తనాల ఎంపిక, పురుగుమందుల వినియోగం, ఎరువులవాడకంపై విద్యార్థులకు సేవకేంద్రం నిర్వాహకులు నీరటివాణి ప్రశాంత్, సాత్విక్ వివరించారు.సేంద్రీయ వ్యవసాయం సాగుచేయడంలో తీసుకోవాల్సిన అంశాలు ఎరువుల వాడకంపై విద్యార్థులు ఆగ్రోస్ సంఘం నిర్వాహకులు వాణిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సందేహాలను వాణి నివృత్తి చేశారు.

మార్కెట్ యార్డు కార్మికుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డు కార్మికుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐటీయూసీ నాయకులతో కలిసి రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఉమామహేశ్వర ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర 2వ మహాసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ముప్పగంగారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు,రాష్ట్రమార్కెట్‌యార్డు డైరెక్టర్ శివ ప్రసాద్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో మార్కెట్ యార్డు పట్ల కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలు, కార్మికులు,రైతులుఎదుర్కొంటున్న సమస్యలు, రాబోయే కాలంలో మార్కెట్ యార్డుల అభివృద్ధి, తీసుకుంటున్నటువంటి కార్యక్రమాలు వంటివిషయాలపై సుదీర్ఘమైన చర్చలు జరిగి తీర్మానాలు ఆమోదించనున్నట్లు తెలి పారు. భవిష్యత్తు కార్యాచరణపైసభలో చర్చిం చి రూపొందించ నున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షుడు నర్సింగ్ రావు, ఉపాధ్యక్షుడు చక్రపాణి, భాగ్యలక్ష్మి సాయిలు, హన్మాండ్లు,అనిల్,కవిత, సంపత్ పాల్గొన్నారు.

కల్చరల్ సెక్రెటరీకి సన్మానం



సన్మానిస్తున్న పద్మశాలి సంఘ నేతలు

ఇందల్వాయి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండలం లోని నల్లవెల్లి గ్రామం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో తస్నీరు వాసుకు ఆదివారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలో జిల్లా పద్మశాలి వసతి గృహ ఎన్నికల్లో మండలంలోని అన్సాన్‌పల్లిగ్రామానికి చెందిన తస్నీరు వాసు కల్చరల్ సెక్రెటరీగా ఇటీవల నియామకమయ్యారు. ఈ సందర్భంగా తస్నీర్ వాసుని ఘనంగా సన్మానించారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా యాదగిరి, వర్కింగ్ ప్రసిడెంట్ పుల్ల హన్మాండ్లు, సహాయ కార్యదర్శి లక్కపత్రి దేవిదాస్, కల్చరల్ సెక్రెటరీ తస్నీరు వాసు, జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్, కార్యదర్శి చిలుక రాజు ఎన్నికయ్యారు. ఈ సంద ర్భంగా నల్లవెల్లి సంఘం అధ్యక్షుడు తిరుమల శ్రీనివాస్ మాట్లాడు తూ మండల వాసికి జిల్లా పద్మశాలి వసతిగృహ కల్చరల్ సెక్రెటరీగా నియా మకం పొందడం చాలా సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ కుల బంధువులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

దేవి : భద్రకాళి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మిరాయి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జాలీఎల్‌ఎల్‌బి-3 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : కిష్కింధపూరి (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు (11.00)
: మిరాయి (1.35, 4.35, 7.35, 10.35)
స్క్రీన్-2 : భద్రకాళి (10.50): కిష్కింధపురి (1.40, 7.30)
: జాలీఎల్‌ఎల్‌బీ-3 (హిందీ) (4.30, 10.30)
స్క్రీన్-3 : మిరాయి (11.00): జాలీఎల్‌ఎల్‌బీ-3 (హిందీ) (1.55)
: లిటిల్ హార్ట్స్ (4.45): భద్రకాళి (7.30): మత్తు రా (10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : జాలీ ఎల్‌ఎల్‌బీ-3 (హిందీ) (10.00)
: మిరాయి (1.15, 7.25, 10.50): కిష్కింధపూరి (4.40)
స్క్రీన్-2 : మిరాయి (10.10, 4.05)
ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు (1.35)
: జాలీ ఎల్‌ఎల్‌బీ-3 (హిందీ) (7.30, 10.40)
స్క్రీన్-3 : లిటిల్ హార్ట్స్ (12.45, 7.55) : డెమన్ స్లయర్ (ఇంగ్లీష్) (3.30)
: బ్యూటీ (10.40)
స్క్రీన్-4 : టన్నెల్ (10.50) : దక్ష (1.40)
: జాలీ ఎల్‌ఎల్‌బీ-3 (హిందీ) (4.00)
: భద్రకాళి (7.15)
: కిష్కింధపురి (10.35)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,15,800	రూ.1,07,000	రూ.1370

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో) :	రూ.170	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో) :	రూ.175	రూ.265	రూ. 285

